
సాక్షి గుంటూరు

మంగళవారం । 18 । మార్చి । 2025



లక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల

క్రోసూరు: బయ్యవరం గ్రామంలో సోమవారం లక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల ఘనంగా జరిగింది. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు.




సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 519.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.



బాల్య వివాహాలు నేరం

నరసరావుపేట రూరల్: బాల్య వివాహాలు నేరమని డీఆర్ఓ మురళి తెలిపారు. నీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నియంత్రణ పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు.



న్యూస్‌రీల్

గోగులమ్మను తాకిన సూర్య కిరణాలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు గ్రామ దేవత శ్రీ గోగులమ్మను సోమవారం ఉదయం సూర్య కిరణాలు తాకాయి. ఏటా ఫాల్గుణ మాసంలో అమ్మ విగ్రహంపై కిరణాలు ప్రసరిస్తాయని అర్చకులు దీవి గోపి తెలిపారు. ఈ అపురూప దృశ్యాన్ని భక్తులు దర్శించుకుని తరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

1,35,230 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,35,230 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,23,246 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 68,198 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

మత్స్యావతారంలో శ్రీవారు



మంగళగిరి టౌన్: మంగళాద్రిలో వేంచేసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారి ఆస్థాన అలంకార ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామి శ్రీదేవి భూదేవి సమేతుడై మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో రామకోటిరెడ్డి ఉత్సవాన్ని పర్యవేక్షించారు. కైంకర్యపరులుగా హైదరాబాద్‌కు చెందిన దూర్జటి మధుసూధనరావు, చెంచు వెంకట సుబ్బారావులు వ్యవహరించారు. ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన మిక్లారి రామచంద్ర శర్మ, కృష్ణవేణి దంపతులు వ్యవహరించారు.

ఏఎన్‌ఎంలకు ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్



గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వివిధ గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏఎన్ఎం-గ్రేడ్3గా పనిచేస్తున్న వారికి సోమవారం గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించి మల్టీపర్పస్‌హెల్త్ అసిస్టెంట్ ఫీమేల్‌గా ఉద్యోగోన్నతి ఉత్తర్వులు అందజేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 266 మందికి ఉద్యోగోన్నతి ఇచ్చేందుకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, పల్నాడు జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి, బాపట్ల డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ, ఇతర వైద్యాధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్ ప్రక్రియ ఉదయం నుంచి రాత్రి 10.30 గంటల వరకు కొనసాగింది. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ కార్యాలయం పరిపాలనాధికారి లక్ష్మీకుమారి తదితరులు కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు.

నివేదన పర్వం

అ'పరిష్కార వేదిక'

సమస్యలతో పోరాడుతున్న హృదయాలు అధికారుల కరుణ కోసం నిరంతరం శ్రమిస్తూ ఓడిపోతున్నాయి. వేదనాభరితమై రగిలిపోతున్నాయి. అయినా కర్కశ యంత్రాంగం దయ చూపడం లేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గుండె గోడు పట్టించుకోవడం లేదు. పైగా సమస్య పరిష్కారమైపోయినట్టు మాత్రం రికార్డుల్లో నమోదు చేసుకుంటోంది. ఫలితంగా పేదలు సతమతమవుతున్నారు. మళ్లీ అర్జీలు చేతబట్టి వ్యయప్రయాసలకోర్చి కలెక్టరేట్ మెట్లు ఎక్కుతున్నారు.
ఈ ని'వేదనల' పర్వానికి ముగింపు పలికేదెప్పుడో సర్కారే చెప్పాలి.



దివ్యాంగుడి వినతిపత్రం పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

- అంకెలు ఘనం.. ఫలితం శూన్యం
- పీజీఆర్ఎస్‌లో వినతుల వెల్లువ
- పరిష్కారమైనట్టు చూపి మాయ

సాక్షి ప్రతినిధి, గుంటూరు, గుంటూరు వెస్ట్, గుంటూరు ఎడ్యుకేషన్, లక్ష్మీపురం: జిల్లా అధికారులంతా ఒక్కచోట ఉండే వేదిక. ప్రజా సమస్యలు విని అర్జీలు స్వీకరించే అద్భుత కార్యక్రమం గ్రీవెన్స్. ఇది ప్రతి సోమవారం కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయాలతోపాటు ఎక్కడికక్కడ డివిజన్ స్థాయిలో సబ్‌కలెక్టరేట్, ఆర్డీఓ, మండల స్థాయిల్లో ఎంపీడీఓ కార్యాలయాల్లో జరుగుతుంది. గత ప్రభుత్వం 'స్పందన' పేరుతో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించింది. వచ్చిన ప్రతి అర్జీ పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేసింది. ఒక వేళ ఆ అర్జీ పరిష్కరించదగినది కాకపోతే బాధితులకు అర్థమయ్యేలా వివరించి.. మానవతా దృక్పథంతో వారికి ప్రత్యామ్నాయ పద్ధతుల్లో న్యాయం చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి ఫలితాలు రాబట్టింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రీవెన్స్ ప్రహసనంగా మారింది. స్పందన కార్యక్రమాన్ని ఈ సర్కారు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)గా పేరు మార్చింది. కూటమి సర్కారు వచ్చాక ఇప్పటి వరకు 19,823 అర్జీలు రాగా, 17,478 పరిష్కరించినట్లు అధికారులు చెబుతున్నారు. వారి లెక్కల ప్రకారం 1,672 పెండింగ్‌లో ఉన్నాయి. ఇదంతా అంకెల గారడీనేనని, సమస్యల పరిష్కారం కావడం లేదని, అర్జీదారులు, ప్రజాసంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

జగనన్న ఇంటి పట్టాలు రద్దు చేయడం దారుణం



జంగాల కాలనీలో సుమారు 50 ఏళ్లుగా ఉంటున్నాము. వైఎస్సార్ సీపీ హయాంలో మాకు ఇంటిస్థల పట్టాలను రాజధాని ప్రాంతంలో ఇచ్చారు. కాని పట్టాలు ఇచ్చిన కొంత కాలానికి పట్టాలను లాగేసుకున్నారు. రాజధాని వాసులు కోర్టుకు వెళ్ళారని చెప్పారు. పట్టాలు రద్దు చేయడం దారుణం. పోనీ ఇంకెక్కడైనా స్థలాలు కేటాయిస్తామనీ చెప్పడం లేదు. తక్షణమే స్థలాలు మంజూరు చేయాలి. **-జంగాల కాలనీ వాసులు, వెనిగండ్ల, పెదకాకాని మండలం**

మాటలతో పరిష్కారమైనట్టేనా..!

వాస్తవానికి ఒక అర్హత కలిగిన వ్యక్తి పెన్షన్ కోసం అర్జీ పెట్టుకుంటే.. ఆ పింఛన్ నగదు అతని చేతికి అందినప్పుడే ఆ సమస్య పరిష్కారమైనట్టు.. అయితే అధికారులు వింత పోకడలు పోతున్నారు. పెన్షన్ త్వరలో మంజూరు చేస్తామని సమాధానం ఇచ్చి ఆ అర్జీ పరిష్కారమైనట్టు చూపిస్తున్నారు. అలాగే రోడ్డు కోసం అర్జీ వస్తే నిధులు రాగానే పూర్తిచేస్తామని చెప్పి అర్జీని క్లోజ్ చేస్తున్నారు. ఇలా సమాధానాలతో సమస్యలు పరిష్కారమైనట్టేనా అని అడిగితే అధికారుల వద్ద జవాబు లేదు.

కూటమి తొమ్మిది నెలల పాలనలో జిల్లాలో ఇలా..	
వచ్చిన అర్జీలు	19,823
పరిష్కారమైనట్టు చూపుతున్నవి	17,478
సంక్షేమ పథకాల కోసం వచ్చిన అర్జీలు	4,000

(ఇవన్నీ పరిష్కారం కానివే..)

ప్రదక్షిణలు తప్పడం లేదు



పెదపరిమి గ్రామంలో సర్వే నంబరు 128బీలో మా అమ్మ సామ్రాజ్యం పేరుతో 25 సెంట్లు స్థలం ఉంది. పక్క స్థలం వారు మా స్థలం 15 సెంట్లు కలిపేసుకున్నారు. రికార్డులతో పాటు రిజిస్ట్రేషన్ ఫారాల్లో 25 సెంట్లు మా పేరుతోనే ఉన్నాయి. ప్రస్తుతం 10 సెంట్ల స్థలమే మాకు మిగిలింది. దీనిపై ఆధారాలతో సహా తుళ్లూరు తహసీల్దార్‌కు విన్నవించినా పట్టించుకోవట్లేదు. నెలలో 20 రోజులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. ఇప్పటికి రెండుసార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదు.

– పమ్మల విజయ, పెదపరిమి

సంక్షేమ పథకాల అర్జీలు బుట్టదాఖలు

గత 8 నెలల్లో పీజీఆర్ఎస్‌లో పేదలు వృద్ధాప్య పింఛన్లు, రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు, వికలాంగులు, ఒంటరి మహిళ పింఛన్ల కోసం 4,000కు పైగా అర్జీలను సమర్పించారు. అయితే అధికారులు వీటిని బుట్టదాఖలు చేశారు. ప్రభుత్వ పాలసీ ప్రకారం.. ఇప్పుడు ఇవ్వడం సాధ్యం కాదని చెప్పి అర్జీలను ముగించేస్తున్నారు. దీంతో ప్రజలు వీటికోసం పదేపదే అర్జీలు పెట్టుకునేందుకు వస్తున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పని హామీలు కూడా నెరవేర్చి పేదల పక్షపాతిగా నిలిచారని, ఆ సర్కారుకు, ఈ ప్రభుత్వానికి చాలా తేడా ఉందని ఓ మహిళ కన్నీటి పర్యంతం కావడం గమనార్హం.

అధికంగా వస్తున్న అర్జీలు రెవెన్యూవే..

ప్రజల నుంచి అత్యధికంగా వస్తున్న అర్జీలు రెవెన్యూకు చెందినవి కావడం విశేషం. ఆ తర్వాత పోలీస్, మున్సిపాలిటీ, పంచాయతీ రాజ్, మెడికల్‌కు చెందినవి వస్తున్నాయి. రెవెన్యూ అర్జీల్లో కొన్ని కోర్టు పరిధిలో ఉన్నాయని, పోలీసు అర్జీల్లో కొన్ని సివిల్‌కి సబంధించినవని అధికారులు చెబుతున్నారు.

జాలి లేకుండా పింఛన్ ఆపేశారు



మా నాన్న రామ్మోహనరావు జిల్లా కోర్టులో అటెండర్‌గా ఉద్యోగ విరమణ చేశారు. 2002లో ఆయన మరణించిన తరువాత అమ్మ లలితకు పెన్షన్ ఇచ్చేవారు. రెండేళ్ల క్రితం ఆమె చనిపోవడంతో నేను అనాథగా మారా. బ్రాడీపేటలోని షిర్డీసాయి దీనజనసేవా సమితిలో ఆశ్రయం పొందుతున్నా. దివ్యాంగుడినైనా నాకు నాన్న పెన్షన్ ఆపేశారు. సామాజిక పెన్షనూ ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఇంత కర్కశంగా వ్యవహరిస్తే నేను ఎలా బతకాలి?

–పులిపాక శివ శంకర్, గుంటూరు

పేదల గూడు సమస్య పరిష్కరించండి



రాజధాని ప్రాంతంలో దాదాపు 30 ఏళ్ళ నుంచి సుమారు 70 కుటుంబాలు నివసిస్తున్నాయి. గత ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను ఇప్పుడు రద్దు చేశారు. పేదలకు న్యాయం చేయాలి. గూడు కోసం వేడుకుంటున్న పేదల కష్టాలను రాజకీయాలకు అతీతంగా చూడాలని మనవి.

– ఎం.హేమలత, వి.రవితేజ, దళిత బహుజన రీసోర్స్ సెంటర్

వైద్యమిత్రల వేతనం పెంచాలి



వైద్య మిత్రగా పనిచేస్తున్నా. నా భర్త 2008లో ఇద్దరు చిన్నపిల్లలతో నన్ను వదిలి వెళ్లిపోయారు. అప్పటి నుంచి వైద్యమిత్రగా పనిచేస్తున్నా. గత ప్రభుత్వంలో వైద్య మిత్రల జీతాన్ని రూ.7,088 నుంచి రూ.15వేలు చేశారు. ఎన్నికల సమయంలో కనీస వేతనం రూ.30 వేలు చేస్తామని కూటమి హామీ ఇచ్చింది. వెంటనే జీతాలు పెంచాలి.

–డి.వి.శివకుమారి, అమరావతి రోడ్డు వైద్య మిత్ర

75 ఏళ్ల వయసులో పాస్ పుస్తకం కోసం..



మా తాత, ముత్తాతల నుంచి ఉన్న పొలానికి కొందరు అక్రమంగా కాగితాలు పుట్టించారు. చివరికి పొలం తమదేనంటున్నారు. దీనిపై తహసీల్దార్‌ను పలుమార్లు కలిసి, ఫిర్యాదు చేశా. పట్టించుకోలేదు. దీంతో నడవలేని స్థితిలో గుంటూరు వచ్చి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చా. ఫలితం లేదు. మా భూమిపై మాకు హక్కు కల్పించాలి. పాస్‌పుస్తకం ఇప్పించాలి.

– భీమినేని వెంకట్రావు, అనంతవరప్పాడు, వట్టిచెరుకూరు మండలం

స్థలం ఆక్రమించారు



నల్లచెరువు 2వ లైనుకు చెందిన మాకు 1972 నుంచి 78 గజాల స్థలం ఉంది, 1982లో మా పేరుతో పట్టా ఇచ్చారు. ఓర్సు రమేష్, కృపానందం అనే వ్యక్తులు అక్రమంగా జొరబడి స్థలంలో ఉన్న ఇంటిని కూల్చివేశారు. తప్పుడు పట్టా సృష్టించి మాపై దౌర్జన్యం చేస్తున్నారు. కార్పొరేషన్‌లో నాలుగుసార్లు అర్జీ పెట్టినా ఫలితం లేదు. వృద్ధులం మేమేం చేయగలం. కలెక్టర్‌కు మొరపెట్టుకున్నాం.

– మన్నెం పిచ్చియ్య, జసింత, గుంటూరు


వరద సాయమేదీ?



గత ఏడాది అక్టోబర్‌లో వచ్చిన వరదలకు బొంగరాలబీడు, వసంతరాయ కాలనీ ప్రాంతాల్లో సుమారు 600 కుటుంబాలు నష్టపోయాయి. వరద సాయంగా రూ.10 వేలు ఇస్తామన్నారు. దాదాపు 3 నెలలు పోరాటం చేసినా ఫలితం దక్కలేదు. ప్రభుత్వ విధానాలకు, అధికారుల పనితీరుకు చాలా వ్యత్యాసం ఉంది.

– కె.జయసుధ, వీకేసీ (వదుదళై చిరుతల కక్షి) పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు.

పది పరీక్షలు ప్రారంభం



గుంటూరులో పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు

- తొలిరోజు హడావుడి, ఆందోళన
- పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు విద్యార్థుల అవస్థలు
- గుంటూరులో రోల్ నంబర్లు వేయకపోవడంతో తల్లిదండ్రుల నిలదీత
- చీఫ్ సూపరింటెండెంట్ నిర్లక్ష్య సమాధానం
- విచారణ అనంతరం విధుల నుంచి తొలగింపు
- తెనాలిలో ఓ విద్యార్థికి కాంపోజిట్ పేపర్ బదులు తెలుగు పేపర్

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల తొలిరోజు సోమవారం విద్యార్థులు అవస్థలు పడ్డారు. పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ రద్దీతో సమయానికి పరీక్షకు వెళ్లగలమా లేదా అని ఆందోళన చెందడం కనిపించింది. సోమవారం జిల్లా వ్యాప్తంగా 150 పరీక్ష కేంద్రాల్లో టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 27,506 మంది విద్యార్థులకు 27,350 మంది పరీక్షకు హాజరయ్యారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి గుంటూరు బ్రాడీపేటలోని శారదానికేతన్ పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. టెన్త్ పరీక్షల జిల్లా పరిశీలకురాలు పి.పార్వతి ఎనిమిది, ప్రభుత్వ పరీక్షల విభాగ డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి రెండు, జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ఐదు చొప్పున పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు జిల్లా వ్యాప్తంగా 56 పరీక్ష కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. 147 మంది ప్రైవేటు విద్యార్థుల్లో 105 మంది పరీక్షకు హాజరయ్యారు. ఎనిమిది కేంద్రాల్లో జరిగిన దూరవిద టెన్త్ పరీక్షలకు 12 మంది అభ్యర్థుల్లో తొమ్మిది మంది హాజరయ్యారు.

రోల్ నంబర్లు వేయకపోవడంతో గందరగోళం

గుంటూరులోని హిందూ కాలేజీ హైస్కూల్ పరీక్ష కేంద్రంలో రెగ్యులర్‌తోపాటు దూరవిద్య పరీక్షలకు ఏర్పాట్లు చేశారు. అయితే రోల్ నంబర్లు వేయకపోవడంతో విద్యార్థులు గందరగోళానికి గురయ్యారు. దీంతో తల్లిదండ్రులు నిర్వాహకులను నిలదీశారు. అదే సమయంలో రెగ్యులర్ టెన్త్ ప్రశ్నపత్రాలను తీసుకువచ్చేందుకు చీఫ్ సూపరింటెండెంట్ స్టోరేజి పాయింట్‌కు వెళ్లడంతో దూరవిద్య పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ గోవిందయ్య తల్లిదండ్రులతో దురుసుగా ప్రవర్తించారు. దీనిపై తల్లిదండ్రులు డీఈఓ సీవీ రేణుకకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె ఎంఈఓ అబ్దుల్ ఖుద్దూస్‌ను పంపించారు. విచారణ జరిపిన ఎంఈఓ ఇచ్చిన నివేదిక ఆధారంగా గోవిందయ్యను పరీక్షల విధుల నుంచి డీఈఓ తొలగించారు.

ఒక పేపరుకు బదులు.. మరొక పేపర్

తెనాలి ఐతానగర్‌లోని ఎన్ఎస్ఎస్ఎం మున్సిపల్ హైస్కూల్ కేంద్రంలో ఓ విద్యార్థికి 70 మార్కుల తెలుగు కాంపోజిట్ ప్రశ్నపత్రం (03టీ)కి బదులుగా ఇన్విజిలేటర్ 100 మార్కులకు తెలుగు ప్రశ్నపత్రం (01టీ) ఇచ్చారు. విద్యార్థిని జవాబులు రాసి, పరీక్ష ముగిసిన తరువాత ఈ విషయాన్ని పరీక్ష కేంద్ర నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై విచారణ జరిపిన అధికారులు ప్రశ్నపత్రం ఇచ్చిన ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేసి, సంజాయిషీ ఇవ్వాల్సిందిగా సీఎస్, డీవోలను ఆదేశించారు. విద్యార్థినికి ఎటువంటి నష్టం జరగకుండా చూస్తామని, ఆమె రాసిన ఆన్సర్ షీట్‌ను వాల్యూయేషన్ చేయిస్తామని డీఈఓ సీవీ రేణుక చెప్పారు. ఈ రెండు ఘటనలు మినహా జిల్లాలో పరీక్షలు సజావుగా జరిగినట్లు ఆమె పేర్కొన్నారు.

జనజ్జేతకు జేజేలు

- తెనాలిలో అడుగడుగునా నీరాజనం
- మాజీ ఎమ్మెల్యే శివకుమార్ కుమారుడి పెళ్లి రిసెప్షన్‌కు మాజీ సీఎం వైఎస్ జగన్
- వధూవరులకు ఆశీర్వచనం



వివాహ రిసెప్షన్‌కు హాజరైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కరచాలనం చేసేందుకు పోటీపడుతున్న ప్రజలు

తెనాలి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెనాలి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పార్టీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్-పుష్పశ్రీల పెద్ద కుమారుడు సత్యనారాయణ చౌదరి, మాజీ మంత్రి స్వర్గీయ ఎంఎస్‌ఎస్ కోటేశ్వరరావు మనవరాలు, మాదల రాజేంద్ర-పద్మినీదేవి కుమార్తె మధువంతి వివాహ రిసెప్షన్ కోసం సోమవారం రాత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెనాలి వచ్చారు. రోడ్డు మార్గాన విజయవాడ నుంచి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాయంత్రం ఆరు గంటలకు విజయవాడ-తెనాలి రోడ్డులోని రూరల్ మండల గ్రామం నందివెలుగుకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ వేచిఉన్న ప్రజలు, అభిమానులు కాన్వాయ్ ఎదుట పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అక్కడి నుంచి అడుగడుగునా నీరాజనాలు పట్టారు. వేలాది ద్విచక్రవాహనాల్లో కార్యకర్తలు, అభిమానులు కాన్వాయ్ ముందు ఊరేగింపుగా కదిలారు. ఊరివెలుపల వీఎస్సార్ కాలేజీకి చేరుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్ ముందు బాణసంచా కాల్చారు. అక్కడి నుంచి ప్రతి కూడలిలోనూ తమ ప్రియతమ నేతను చూసేందుకు ప్రజలు వేచి ఉన్నారు. కారులో అభివాదం చేస్తూ కనిపించిన జననేతను చూసి కేరింతలు కొట్టారు. పలుచోట్ల జగన్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తూ కనిపించారు. వేలాది వాహనాలతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. నందివెలుగు నుంచి దాదాపు పది కిలోమీటర్లలోని ఏఎస్ఎన్ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలోని పెళ్లి రిసెప్షన్ వేదికకు చేరుకునేందుకు రెండు గంటల సమయం పట్టింది. అక్కడ కిక్కిరిసిన జనసందోహానికి అభివాదం చేసుకుంటూ వైఎస్ జగన్ వేదికపైకి చేరుకున్నారు. సీఎం, సీఎం అంటూ జగన్నినాదాలు మిన్నంటాయి. అభిమానులు వైఎస్ జగన్‌పై పూలవర్షం కురిపించారు. అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. నూతన వధూవరులు సత్యనారాయణచౌదరి- మధువంతిని ఆశీర్వదించారు. మాజీ ఎమ్మెల్యే శివకుమార్ దంపతులు, మాదల రాజేంద్ర దంపతులను పలకరించారు. వేలాదిగా హాజరైన ప్రజలకు అభివాదం చేశారు. 8.25 గంటలకు తిరిగి బయలుదేరి వెళ్లారు. మాజీ సీఎం పర్యటనలో పోలీసులు కనీస బందోబస్తు ఏర్పాట్లు చేయలేదు. ఎప్పటిలా ఉండే ట్రాఫిక్ పోలీసులు, కాన్వాయ్ ముందు వాహనంలో పర్యటించిన పోలీసులు మినహా సిబ్బంది కనిపించలేదు. ప్రతిచోటా ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. కార్యకర్తలు, మాజీ సీఎంతో ఉన్న సెక్యూరిటీ వాళ్లే రోడ్డు క్లియర్ చేశారు.



వైఎస్ జగన్‌ను చూసి అభివాదం చేస్తూ కేరింతలు కొడుతున్న తెనాలి వాసులు

రూ.1,534 కోట్ల వార్షిక బడ్జెట్‌కు ఆమోదం

మేయర్ రాజీనామాతో నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం

నెహ్రూ నగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరంలో సుమారు 361 పనులకు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపిందని కమిటీ అధ్యక్షుడు కొమ్మినేని కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం స్టాండింగ్ కమిటీ సమావేశం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించారు. నగర మేయర్ రాజీనామా చేయడంతో ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్ 1955 ప్రకారం స్టాండింగ్ కమిటీ సభ్యుల్లో ఒకరిని సమావేశానికి తాత్కాలిక అధ్యక్షులుగా ఎన్నుకోవచ్చన్న నిబంధన మేరకు స్టాండింగ్ కమిటీ సభ్యులు కొమ్మినేని కోటేశ్వరరావును అధ్యక్షులుగా ఏకాభిప్రాయంతో ఎన్నుకున్నారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించి పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. అనంతరం జరిగిన ప్రత్యేక సమావేశంలో రూ.670.23 కోట్ల ప్రారంభ నిల్వ, రూ.864.04 కోట్ల జమల అంచనాతో మొత్తం రూ.1534.27 కోట్లతో 2025-26 వార్షిక బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, దాసరి లక్ష్మీదుర్గ, ముప్పవరపు భారతి, సూకవరపు బాలాజీ, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎగ్జామినర్ నాగేంద్ర కుమార్, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, సెక్రెటరి పి.శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 7,500 గరిష్ఠం : రూ. 9,500

మోడల్ ధర రూ. 8,400

క్లుప్తంగా

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో సోమవారం 410 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొమ్ములు 263 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ట ధర రూ.7,750 గరిష్ట ధర రూ.11,000 మోడల్ ధర రూ.9,000, కాయలు 147 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ట ధర రూ.7,750 గరిష్ట ధర రూ.9,700 మోడల్ ధర రూ.8,900, మొత్తం 307.500 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు ఆయన తెలిపారు.

పసుపు రైతులకు పరిహారం చెల్లించాలని వినతి



తెనాలి: దుగ్గిరాలలోని శుభమ్ మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ అగ్నిప్రమాదంలో దగ్ధమైన పసుపునకు ప్రభుత్వం ఇచ్చిన హామీప్రకారం పరిహారాన్ని త్వరితగతిన చెల్లించాలని బాధిత రైతులు తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహకు విజ్ఞప్తి చేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. 296 మందికి రూ.15 కోట్ల బీమా క్లెయిమ్ అయినట్టు సబ్‌కలెక్టర్ వెల్లడించారు. పరిహారం అందకపోవటంతో రైతులు ఆర్థిక సమస్యలతో అవస్థలు పడుతున్నారని చెప్పారు.

ఆరోగ్య మిత్రల నిరసన

గుంటూరు మెడికల్: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం (ఆరోగ్యశ్రీ)లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోరతూ సోమవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. గుంటూరులోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం జిల్లా కో ఆర్డినేటర్ కార్యాలయం ఎదుట కార్యక్రమం జరిగింది. అక్కడి నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శివ కుమారి, జిల్లా అధ్యక్షుడు జాకీర్‌హుస్సేన్, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు.

జనసేన నేత బెదిరింపులపై ఫిర్యాదు



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న దంపతులు

నగరంపాలెం: ప్రైవేటు వైద్యులు సక్రమంగా శస్త్రచికిత్సలు నిర్వర్తించకపోవడంతో కుమారుడు మంచానికి పరిమితమైనట్లు ఓ తండ్రి వాపోయారు. జనసేన నేతపై భార్యభర్తలు ఫిర్యాదు చేశారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ఏఎస్పీ (పరిపాలన) ఏవీ రమణమూర్తి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. బాధితులకు సకాలంలో న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఏఎస్పీలు కె.సుప్రజ (క్రైం), హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు రమేష్ (ట్రాఫిక్), శివాజీరాజు (సీసీఎస్)లు కూడా అర్జీలు స్వీకరించారు. రెండేళ్ల క్రితం కుమారుడు వంశీ క్రికెట్ ఆడుతుండగా కుడి కాలికి గాయం కావడంతో శస్త్రచికిత్స చేసినా ఫలితం దక్కలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నామని చిలకలూరిపేటకు చెందిన తండ్రి దార్ల జోజయ్య తెలిపారు. సంగడిగుంట జీరో వీధికి చెందిన ఓ వివాహిత తన అత్తింటివారిపై ఫిర్యాదు చేశారు. తన భర్తకు మరో పెళ్లి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, భర్తను పిలిచి విచారించాలని కోరారు. గుంటూరు టౌన్‌కు చెందిన ఎస్.వెంకటేశ్వరరావు తన కుమారుడికి ఉద్యోగం నిమిత్తం ఉండవల్లిలోని కన్సల్టెన్సీని సంప్రదించారు. రూ.1.30 లక్షలు చెల్లించాక నకిలీ కాల్ లెటర్ ఇచ్చారని చెప్పారు. న్యాయం చేయాలని కోరారు. కొబ్బరికాయల సాంబయ్య కాలనీకి చెందిన డ్వాక్రా గ్రూప్ లీడర్‌పై లాలాపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశామని విజయలక్ష్మి, దేవి, దేవిక, హేమలత తెలిపారు. రూ.4.70 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. పాతగుంటూరు, దుర్గానగర్ ఒకటో వీధికి చెందిన కర్పూరపు రమాదేవి, రాంబాబు మాట్లాడుతూ.., జనసేన నేతకు రూ.4 లక్షలు ఇచ్చామన్నారు. తిరిగి ఇవ్వడం లేదని వాపోయారు.



జోజయ్య, చిలకలూరిపేట

పేదలకు భూములిచ్చే వరకు పోరాటం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జల్లి విల్సన్



సమావేశంలో మాట్లాడుతున్న జల్లి విల్సన్

లక్ష్మీపురం: గ్రామీణ కష్ట జీవులకు ఇళ్ల స్థలాలు, సాగు భూములు దక్కేవరకు పోరాటాలు ఆగవని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు జల్లి విల్సన్ అన్నారు. కొత్తపేటలోని మల్లయ్య లింగంభవన్‌లో సోమవారం రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్. కోటేశ్వరరావు అధ్యక్షతన రెండు రోజుల రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు ప్రారంభించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి గ్రామీణ కష్ట జీవులకు సాగుభూములు, ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులను అమలు చేస్తే పేదలకు ఇళ్ల స్థలాలు, సాగు భూములు అందుతాయని పేర్కొన్నారు. ఆ సిఫారసులను చెత్త బుట్టలో వేశారన్నారు. ప్రభుత్వం పంపిణీ చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూపోరాటాలు చేసి పేదలకు పంచుతామని హెచ్చరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు పూర్తి అయినప్పటికీ సూపర్ సిక్స్ హామీల అమలులో అతీగతీ లేదన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 2 లక్షల పింఛన్లు తొలగించారని ఆరోపించారు. పేదలకు సంక్షేమ పథకాలు తగ్గించాలనే ఎత్తుగడలతో గ్రామాల్లో సర్వే చేస్తున్నారన్నారు. ఉపాధి హామీని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం నుంచి డబ్బులు రాకున్నా అడిగే పరిస్థితి కనిపించడం లేదన్నారు. కూలీలు చేసిన పనికి డబ్బులు సరిగా ఇవ్వకుండా, రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 10 వారాల నుంచి పెండింగ్ బకాయిలు ఉన్నాయని చెప్పారు. దీనికి రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నిర్లక్ష్యమే కారణమన్నారు. సనాతన ధర్మంపై ఉన్న ఆసక్తి ఉపాధి హామీ కూలీల బకాయిలు విడుదల చేయడంలో ఆయనకు లేదని విమర్శించారు. ఐఎఫ్‌టీపీ జాతీయ కార్యదర్శి ఘని మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘంలో గ్రామీణ కష్ట జీవులకోసం అసువులు బాసిన అమరవీరుల సంస్మరణ దినోత్సవం జూన్ 1న విజయవాడలో నిర్వహించాలన్నారు. జూన్ 10న భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ పిలుపును జయప్రదం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలను సక్రమంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై వీసీలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

లక్ష్మీపురం: ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం గ్రామ, వార్డు సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వేలను నిర్దేశించిన త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు సచివాలయ ఉద్యోగులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో వీసీ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలను నిర్దేశించిన లక్ష్యాల మేరకు వేగవంతం చేసేలా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులను సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలన్నారు. పీఎంఏవైలో ఇళ్ల నిర్మాణం మంజూరుకు డిమాండ్ సర్వేలో గుర్తించిన లబ్ధిదారులకు సంబంధించి అవసరమైన ధృవపత్రాలు మార్చి 31 నాటికి హౌసింగ్ వెబ్ సైట్‌లో అప్లోడ్ చేయించాలన్నారు. బీసీల స్వయం ఉపాధి రుణాలకు సంబంధించి ఓబీఎంఎస్ లో నమోదైన లబ్ధిదారుల దరఖాస్తులను జాగ్రత్తగా పంపించాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ వి జ్యోతిబసు, హౌసింగ్ పీడీ ప్రసాద్ , డీపీఓ సాయి కుమార్, డ్వామా పీడీ శంకర్, సీపీఓ శేషశ్రీ, పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి , జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ నర్సింహారావు, జిల్లా భూగర్భజలవనరుల శాఖ డీడీ వందనం, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న పూర్ణచంద్, శ్రీనివాసరావు

తెనాలి అర్బన్: ఇండియా తైక్వాండో సహకారంతో ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2, 3వ తేదీలలో తెనాలిలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి కె.శ్రీనివాసరావు, రాష్ట్ర చీఫ్ కోచ్ రోహిత్ వర్మలు తెలిపారు. సోమవారం తెనాలిలో పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు రానున్నట్లు చెప్పారు. విజేతలు ఉత్తరాఖండ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హులు అవుతారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ కోశాధికారి ఈదర పూర్ణచంద్, రాష్ట్ర తైక్వాండో ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

లంక పొలాల సమస్య పరిష్కరించాలి



రైతులతో మాట్లాడుతున్న నేతాజీ

తాడేపల్లి రూరల్: కుంచనపల్లిలోని దళిత లంక పొలాల సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో సోమవారం సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజాచైతన్య యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన రైతులతో మాట్లాడారు. కృష్ణానది ఒడ్డున దళితులకు ఇచ్చిన 30 ఎకరాల లంక పొలాల సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. సాగు చేసుకునేందుకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేనందున ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు, నాయకులు నాగపోగు విజయరాజు, అమ్మిశెట్టి రామారావు, కంచర్ల సాంబశివరావు, కొండపల్లి యశోద, సింగంశెట్టి రవికిషోర్, అమ్మిశెట్టి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మాల్ ప్రాక్టీసుకు తావు లేకుండా చర్యలు

జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి



గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో మాల్ ప్రాక్టీసుకు తావు లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి ఆదేశించారు. సామవారం బ్రాడీపేటలోని శారదానికేతన్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో కేటాయించిన 229 మంది విద్యార్థులకుగానూ నూరు శాతం హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మౌలిక సదుపాయాలపై జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. వైద్యారోగ్యశాఖ ద్వారా ఏర్పాటు చేసిన క్యాంపులో అందుబాటులో ఉంచిన మందులను పరిశీలించారు. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కలెక్టర్ వెంట గుంటూరు పశ్చిమ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్‌ఎం ఉషాకుమారి ఉన్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

- అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తాం
- వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రాష్ట్ర సంచాలకులు



ఖాజీపేటలో పెసర పంటను పరిశీలిస్తున్న విజయసునీత

తెనాలి టౌన్: రైతు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రాష్ట్ర సంచాలకులు ఎం.వి జయసునీత పేర్కొన్నారు. సోమవారం తెనాలి నియోజకవర్గంలో ఆమె పర్యటించారు. రూరల్ మండలం ఖాజీపేట, హాఫ్‌పేట పరిధిలో రైతులు వేసిన పెసర పంటను పరిశీలించారు. గిట్టుబాటు ధరను తెలుసుకున్నారు. వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోయారు. దీంతో వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్‌ను ఆదేశించారు. కొల్లిపర మండలంలో అత్తోట గ్రామంలో పర్యటించి తెల్లజొన్నను పరిశీలించారు. క్వింటాకు రూ.2,200 ధర లభిస్తున్నట్లు రైతులు తెలియజేశారు. కొల్లిపరలో పసుపు రైతులతో మాట్లాడారు. క్వింటా రూ.8000 - రూ.11,000 మధ్య ఉందని రైతులు పేర్కొన్నారు. రైతులు ధైర్యంగా ఉండాలని ఆమె సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. మార్కెటింగ్ శాఖ విజయవాడ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కాకుమాను శ్రీనివాసరావు, గుంటూరు సహాయ మార్కెటింగ్ శాఖ సంచాలకులు డి.రాజాబాబు, తెనాలి, దుగ్గిరాల మార్కెట్‌యార్డు కార్యదర్శులు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ జె.కృష్ణారావు, జీడీసీఎంఎస్ గుంటూరు బిజినెస్ మేనేజర్ హరిగోపాల్, గుంటూరు, తెనాలి, కొల్లిపర మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మంగళగిరి టౌన్ : మంగళగిరి నగర పరిధిలోని బిస్మిల్లా హోటల్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం... గత 5 రోజుల నుంచి ఓ వ్యక్తి మంగళగిరి పాతబస్టాండ్ సమీపంలో వున్న బిస్మిల్లా హోటల్ దగ్గర ఉంటున్నాడు. అతని ఆరోగ్యం సరిగా లేదని, కొన్ని రోజులుగా భోజనం, తాగునీరు అందజేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం ఆ వ్యక్తి మృతి చెందాడని పోలీసులకు సమాచారం ఇచ్చారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మహిళా చైన్ స్నాచర్ అరెస్ట్

42 గ్రాముల బంగారం స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న మంగళగిరి పట్టణ ఎస్ఐ రవీంద్రనాయక్

మంగళగిరి టౌన్: ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఓ మహిళను మంగళగిరి పట్టణ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. మంగళగిరి పట్టణ ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాల మేరకు... పాత మంగళగిరికి చెందిన సత్యవతి నివాసానికి అద్దెకు ఇల్లు కావాలంటూ ఓ మహిళ వచ్చింది. మాట కలిపాక ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కుని బయటకు పరిగెత్తింది. సత్యవతి పెద్దగా కేకలు వేయడంతో ఆ మహిళ చైన్‌ను అక్కడ వదిలేసి పారిపోయింది. సోమవారం మంగళగిరి రత్నాలచెరువు అండర్ పాస్ వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఓ మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారించగా విజయవాడకు చెందిన మానసవాణి అని, గతంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన చైన్ స్నాచింగ్ కేసుకు సంబంధించి 42 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మానసవాణిపై విజయవాడలో సింగ్ నగర్, కృష్ణలంకలో రెండు చైన్ స్నాచింగ్ కేసులు నమోదయ్యాయని విచారణలో తెలిసినట్లు తెలిపారు. మానసవాణిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రవీంద్రనాయక్ తెలిపారు.

కోకోకు గిట్టుబాటు ధర కల్పించాలని వినతి

సాక్షి, అమరావతి: కోకోకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేనంత తక్కువ ధరకు కంపెనీలు కొనుగోలు చేయడం వలన తాము తీవ్రంగా నష్టపోతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కోకో గింజల కొనుగోలు కంపెనీలు, కోకో రైతుల సంఘాల ప్రతినిధులతో సోమవారం గుంటూరులోని ఉద్యాన శాఖ కార్యాలయంలో సమీక్ష జరిగింది. కంపెనీల మాయాజాలం వలన తాము ఏవిధంగా నష్టపోతున్నామో పలువురు కోకో రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఏపీ కోకో రైతు సంఘం ప్రతినిధులు ఎస్.గోపాలకృష్ణ, బొల్లు రామకృష్ణ, కోనేరు సతీష్ బాబు, గుదిబండి వీరారెడ్డి తదితరులు మాట్లాడుతూ . అంతర్జాతీయ మార్కెట్లో కోకో గింజలకు కిలోకు రూ.700లకు పైగా పలుకుతుండగా, రాష్ట్రంలో కంపెనీలు మాత్రం కిలో రూ.550-600కు మించి చెల్లించడం లేదన్నారు. డైరెక్టర్ కే శ్రీనివాసులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ మేరకు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సంఘ ప్రతినిధులు డైరెక్టర్‌కు అందజేశారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు, రైతులు పాల్గొన్నారు

27న మహా ప్రదర్శన జయప్రదం చేయండి



నినాదాలు చేస్తున్న యూనియన్ నాయకులు

లక్ష్మీపురం: ఈ నెల 27వ తేదీన విజయవాడ, ఆర్.టి.సి, వి.సి. అండ్ ఎం.డి. కార్యాలయం వద్ద రిటైర్డ్ ఎంప్లాయిస్ సమస్యలు పరిష్కారం కోరుతూ మహా ప్రదర్శన జరుగనుంది. పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా రిటైర్డ్ ఎంప్లాయిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధరరావు పిలుపునిచ్చారు. పాత గుంటూరు సీఐటీయూ కార్యాలంయలో సోమవారం ఏర్పాటు చేసిన సమాశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ట్రెజరర్ రాజారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, పి.శేషగిరిరావు, నాగేశ్వరరావులు మాట్లాడుతూ సమస్యలను వివరించారు.

తైక్వాండోలో చీరాల క్రీడాకారుల ప్రతిభ

చీరాల: తైక్వాండోలో చీరాల క్రీడాకారుల ప్రతిభ చాటారు. ఆదివారం తెనాలిలోని ఎన్టీఆర్ స్టేడియంలో అస్మిత కేలో ఇండియా ఉమెన్స్ లీగ్ జూనియర్, సీనియర్ తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చీరాల క్రీడాకారులు విశేష ప్రతిభ చూపి పతకాలు సాధించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పతకాలు సాధించిన 13 మంది తైక్వాండో క్రీడాకారులను మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ అభినందించి సత్కరించారు. తైక్వాండో పోటీల్లో పది జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొనగా చీరాల నుంచి పోటీల్లో పాల్గొన్న 20 మందిలో 13 మంది క్రీడాకారులు పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. తైక్వాండో పోటీల్లో పాల్గొనడం వలన ఆత్మరక్షణతో పాటుగా శారీరక దృఢత్వం, ఏకాగ్రత, స్నేహ బంధాలు పెరగడంతో పాటుగా స్పోర్ట్స్ కోటాలో ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు పొందుతారన్నారు. జాతీయ పోటీలలో క్రీడాకారులు కాలు సాధించాలని ఆకాంక్షించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణానది కనకదుర్గ వారధి వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. సోమవారం మత్స్యకారులు తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ ఖాజావలి సిబ్బందితో వెళ్లి వారధి 28వ పిల్లర్ వద్ద మృతదేహాన్ని బయటకు తీయించారు. చనిపోయి సుమారు 5-6 రోజులు అయి ఉంటుందని, ఎటువంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. వయస్సు 30-35 ఉండవచ్చని, ఒంటిపై నీలం రంగు జీన్స్ ప్యాంట్, బ్లూ కలర్ ఫుల్ హ్యాండ్స్ షర్ట్ ధరించి ఉన్నాడని చెప్పారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే 0864 5272 186కు ఫోన్ చేయాలని సూచించారు.

గంజాయి విక్రేతలు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

మంగళగిరి: గంజాయి విక్రయిస్తున్న 9 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్‌తో కలిసి ఆయన వివరాలను వెల్లడించారు. నగర పరిధిలోని కాజ గ్రామానికి చెందిన యువకులు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో నిఘా పెట్టామన్నారు. 9 మందిని అరెస్ట్ చేసి, 900 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒడిశా నుంచి చిలకలపూడి భానుప్రసాద్ గంజాయి తీసుకువచ్చి ప్యాకెట్లుగా యువకులకు, విద్యార్థులకు విక్రయిస్తున్నాడని పేర్కొన్నారు. అతడితోపాటు ముఠాలోని డి.శ్యామ్, సి.హెచ్. శేఖర్‌బాబు, చలమారావు, సాగర్, రాము, కుమార్, సురేష్ తదితరులను అరెస్టు చేశామన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

ఫిరంగిపురం: అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన డి.వెంకట సత్యనారాయణ (36) నాలుగేళ్ల నుంచి కౌలుకు పొలం తీసుకుని సాగు చేస్తున్నాడు. నష్టం రావడంతో అప్పులు తీర్చే మార్గం లేక ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవీంద్రబాబు తెలిపారు.